సాక్షి
జనగామ

గురువారం । 31 । ఆగస్టు । 2023



బాధితులకు సోదరులై..
ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయూతనందించారు. - 8లో▸



చంద్రయాన్-3పై అవగాహన
చంద్రయాన్-3పై ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34^0 /24^0

వాతావరణం
జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఇద్దరు డిగ్రీ విద్యార్థుల డీబార్

జనగామ రూరల్: పట్టణ పరిధి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎస్‌డీఎల్‌సీఈ యూజీ సెకండియర్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు పరీక్షల సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య తెలిపారు. కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

ఇంగ్లిష్ హ్యాండ్ రైటింగ్ శిక్షణ



జనగామ రూరల్: మండల పరిధి శామీర్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లిష్‌లో హ్యాండ్ రైటింగ్ ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్షర హ్యాండ్ రైటింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఎండీ.మీరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. అక్షరాలు అదంగా రాయడం ఎంతో ఉపయోగంగా ఉంటుందని, చదవడానికి సులంభంగా ఉండడంతో విషయం తొందరగా అర్థం అవుతుదని చెప్పారు. ఎండీ.ఇబ్రహీం, లింగారెడ్డి, రెహమాన్, నీరజ, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి



లింగాలఘణపురం: త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు కృషి చేయాలి.. ప్రభుత్వ కార్యక్రమాల్లో అందరినీ భాగస్వాములను చేయాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం స్థానిక తహసీల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, తహసీల్దార్ వినయలత, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ మల్లికార్జున్, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, దిశ సభ్యురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి


జనగామ రూరల్: జిల్లాలో అకాల వర్షాలు, వడగళ్లతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 40వేల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయి 20 వేల మంది రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారని అన్నారు. వర్షాకాలం ముగుస్తున్నా ఇప్పటి వరకు పరిహారం అందించలేదన్నారు. రైతులకు సబ్సిడీ ఇవ్వకుండా పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు బీరయ్య, మీట్యానాయక్, లక్ష్మీనర్సింహారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణ సులభం



కొడకండ్ల: ప్రాథమిక దశలో టీబీని గుర్తిస్తే నివారించడం సులభమని జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో టీబీ నిర్ధారణ మొబైల్ పరీక్షల క్యాంపును జిల్లా చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ కుడికాల భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు వారాలకు పైగా దగ్గుతో బాధపడుతున్నవారు తెమడ పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందిస్తామని చెప్పారు. కోఆర్డినేటర్ మధుశ్రీ, డాక్టర్లు హరికృష్ణ, ప్రీతి, విజయవర్షిణి, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి


మనోజ్‌రెడ్డి

చిల్పూరు: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి అన్నారు. ఆయనను సమితి జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డిని ఎంపీపీ సరితబాల రాజు, మార్కెట్ డైరెక్టర్ హరీష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగు రమేష్ అభినందించారు.

‘లింకు’ ఉంటేనే పైసలు

జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

- లేదంటే కూలీలకు డబ్బులు ఆగినట్టే
- రేపటి నుంచే ఆన్‌లైన్ చెల్లింపులు
- 60 శాతం మందే యాక్టివేషన్‌లో..
- అవగాహన లేక ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు



జనగామ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలులో కేంద్ర ప్రభుత్వం పలు కీలక మార్పులు తీసుకువచ్చింది. పథకం నిధులు పక్కదారి పట్టకుండా నింబధనలను మరింత కఠినతరం చేసింది. గత ఏడాది నుంచి పథకం నిర్వహణను తన ఆధీనంలోకి తీసుకున్న కేంద్ర సర్కారు.. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి అందుకు అనుగుణంగా పనులు చేపడుతోంది. తాజాగా సెప్టెంబర్ 1 నుంచి కూలీల చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 60 శాతం పని దినాలు మాత్రమే పూర్తయ్యాయి. ఆధార్ కార్డులు కలిగి ఉన్నవారికి పూర్తి స్థాయిలో అనుసంధానం కాలేదు. పాన్ కార్డు అంటే తెలియని వారు చాలా మంది ఉన్నారు. అయితే సాఫ్ట్‌వేర్ మార్పులతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

సాంకేతిక సమస్యలు

గతంలో ఉపాధి పనులు గుర్తించడం, పనుల్లో మార్పులు, చేర్పులు రాష్ట్ర ప్రభుత్వం చేసేది. సమాచారం మొత్తం గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో (రాగాస్) సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేది. ప్రస్తుతం పథకం నిర్వహణ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతుండగా.. వివరాలను ఎన్‌ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేటివ్ సెంటర్)కు మళ్లించారు. దీంతో సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తడంతో కూలీలకు ఇబ్బందులు తప్పడంలేదు. వేసవి భత్యానికి సంబంధించి ఆప్షన్ లేకుండా పోవడంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా ఆధార్, జాబ్ కార్డు అనుసంధానం, పాన్ కార్డు అప్‌డేట్‌పై అవగాహన లేకపోవడంతో కూలీలు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

అర్హత పేరుతో చెల్లింపుల నిరాకరణ..!

ఏబీపీఎస్(ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టం) అర్హత పేరుతో ఉపాధి డబ్బుల చెల్లింపునకు నిరాకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధార్ ఆధారిత చెల్లింపులకు అర్హులైన యాక్టివ్ లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చూపిస్తోంది. దీంతో 40 శాతం మంది ఏబీపీఎస్‌కు అర్హులుగా లేరన్న విషయాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ గుర్తించింది. వీరంతా ఉపాధి పనులు చేసినా డబ్బులు వచ్చే పరిస్థితి లేదు.

జిల్లాలో మొత్తం జీపీలు :	281
హ్యాబిటేసన్లు :	483
జాబ్ కార్డులు :	1,23,120
ఉపాధి కూలీలు :	2,78,430
పని చేస్తున్న కుటుంబాలు :	65,892
వందరోజులు పూర్తిచేసినవి :	7,551

గ్రామం యూనిట్‌గా పనులు..

అడిగిన వారికి పని కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిర్వహణ ఇక నుంచి పక్కాగా సాగనుంది. అడిగిన 14 రోజుల్లో పని కల్పించాల్సి ఉంది. అయితే ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌లో వివరాలు నమోదయ్యాయంటే పని కల్పించాల్సిందే. లేదంటే నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుంది. కూలీ నుంచి డిమాండ్ తీసుకున్న అధికారి సకాలంలో పని కల్పించకపోతే అతడికి ప్రభుత్వం జరిమానా విధిస్తుంది. ఇలా వసూలు చేసిన జరిమానా నుంచి కూలీలకు భృతి చెల్లిస్తారు. ఇప్పటి వరకు ఉపాధి పనులు జిల్లా యూనిట్‌గా తీసుకుని నిర్వహిస్తుండగా.. ఒక గ్రామంలో ఎక్కువ.. మరో గ్రామంలో తక్కువ పనులు జరుగుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో పాటు ప్రతి గ్రామంలో కల్పించిన పనుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ఒక పని పూర్తయితేనే మరో పని మొదలు పెట్టాల్సి ఉంటుంది. గతంలో చాలా పనులు ఒకేసారి ప్రారంభించేంది.

ఉపాధి పథకం కింద చేపట్టే పనులు

ఉపాధి హామీ పథకం కింద నర్సరీల్లో మొక్కల పెంపకం, మట్టి కట్టలు, పొదల తొలగింపు, పొలాల్లో రాళ్లు ఏరడం, వ్యవసాయ క్షేత్రంలో భూమి చదును, మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం, జంగల్ కట్టింగ్, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులతోపాటు చెరువుల పునరుద్ధరణ, చేపల చెరువులు తీయడం, సాగునీరు పారే కాల్వల పూడికతీత, భూగర్భ జలాలు పెంచే పనులు చేపడుతున్నారు.

ఆందోళన అవసరం లేదు

ఉపాధి కూలీలకు ఆన్‌లైన్ ఆధారితంగా చెల్లింపులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు కూలీల ఆధార్ కార్డును జాబ్ కార్డుకు అనుసధానం తప్పనిసరి చేసింది. జాబ్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. అనుసంధానం చేసిన వారికి కూలి డబ్బులు చెల్లిస్తారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

\- గూడూరు రాంరెడ్డి, డీఆర్‌డీఓ

పైసలు తక్కువ వస్తున్నాయి..

ఇల్లు గడవడానికి ఉపాధి పనికి పోతున్న. ఇంతకు ముందు పనిచేస్తే పైసలు ఎక్కువనే వచ్చేవి. ఇప్పుడు ఎంత పనిచేసినా పైసలు తక్కువ వస్తున్నయి. ఆధార్ కార్డును జాబ్ కార్డుకు లింకు చెయ్యమంటున్నరు. అది ఎట్ల చేయాల్నో మాకు తెల్వదు. పని కోసం పోతే ఇవ్వమని చెప్పుతాండ్లు. సర్కారే లింకు చేయాలె.

\- కుంట సునిత, శామీర్‌పేట

జనగామ మండలం చౌడారం కేజీబీవీలో రక్షాబంధన్ వేడుకలు



రాఖీ సందడి

రాఖీ పండగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు ‘రక్షాబంధన్’ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు విద్యార్థినులతో రాఖీలు కట్టించి సోదరభావాన్ని గుర్తు చేశారు. పండగను పురస్కరించుకొని జనగామ పట్టణంతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన రాఖీల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కంగన్‌హాళ్లు, మిఠాయి షాపుల వద్ద రద్దీ కనిపించింది.

\- జనగామ



- మరిన్ని చిత్రాలు 9లో▸

మెగా డీఎస్సీ వేయాలని ర్యాలీ, రాస్తారోకో

- పోలీసులు, పీడీఎస్‌యూ నాయకుల మధ్య వాగ్వాదం
- పలువురి అరెస్ట్



రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్‌లోని లైబ్రరీ నుంచి సెకెండ్ గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. గేట్ ఎదుట కరీంనగర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ స్వయంగా 13,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించి కూడా ఇప్పుడు ఆ పోస్టులను తగ్గించటం సరికాదన్నారు. మిగిలిన పోస్టులు కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తే నిరుద్యోగులతో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులను అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. రాస్తారోకో చేస్తున్నవారిని అక్కడి నుంచి పంపించేందుకు పోలీసులు యత్నించగా.. విద్యార్థులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, కేయూ బాధ్యులు నరేశ్, రమేశ్‌ను కేయూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆందోళనలో పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా కార్యదర్శి నరేశ్, బాధ్యులు అభిరామ్, రమేశ్, వేణు, శ్రీని వాస్, అజయ్, సేవియా, గోపాల్, రాకేశ్, సంగీత, రజియా సుల్తానా, మౌనిక, రవళి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ సుహాసిని



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నర్సరీలు, సెగ్రిగేషన్‌షెడ్లు, పల్లెప్రకృతి వనాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సుహాసిని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె డీపీఓ, జిల్లా ఫారెస్టు అధికారితో కలిసి గ్రామంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, శ్మశానవాటిక, జీపీ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసేందుకు వారు పనిచేస్తున్న జీపీల్లో పనితీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ రంగాచారి, ఎంపీఓ సుధీర్, శివునిపల్లి, చంద్రుతండా కార్యదర్శులు శ్రీకాంత్, శారద పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి

జనగామ రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఏఎన్‌ఎంలు చేపట్టిన దీక్షలకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ.. అనేక ఇబ్బందులు పడుతూ ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడలేదని అన్నారు. వారికి సీఎం ఇచ్చిన హామీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, అనిత, రజిత స్వప్న, వనజ, రేఖ, సునీత తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన పాలకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కనకారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న పాలక ప్రభుత్వాలు విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు కులాలు, మతాలతో మనుషుల మధ్య చిచ్చు పెట్టడమే కాకుండా.. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు చెప్పిన దళితులకు మూడు ఎకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలకు మోక్షం లేకుండా పోయిందని విమర్శించారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మునిగెల రమేష్, కొడెపాక యాకయ్య, ఎ.అంజయ్య, చిలుమల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి తరహాలో వల్మిడి అభివృద్ధి

- శ్రీ సీతారామచంద్రస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు
- సెప్టెంబర్ 4న సీఎం కేసీఆర్, చిన్న జీయర్‌స్వామి రాక
- మూడో తేదీ వరకే ఏర్పాట్లు పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: భద్రాద్రి తరహాలో వల్మిడి ఆలయానికి గొప్ప చరిత్ర ఉంది.. ప్రపంచానికి చాటిచెప్పేందుకు అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వల్మిడిలోని శ్రీ సీతారామచంద్రస్వామి నూతన ఆలయ ప్రారంభం, విగ్రహాల పునఃప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ సెప్టెంబర్ 4న వస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవతం చేయడానికి బుధవారం ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఉన్నత స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వేద పాఠశాల, రోప్‌వే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆలయంతోపాటు చుట్టూ విద్యుత్ దీపాలు అలంకరించి స్వాగత తోరణాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రారంభోత్సవానికి వేలాదిగా భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో తాగునీరు, అన్నదాన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గత పాలకులు ఆలయ అభివృద్ధిని విస్మరించారని, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 4న సీఎం కేసీఆర్ రామాలయాన్ని ప్రారంభించిన అనంతరం పాలకుర్తిలో రూ.25 కోట్లతో నిర్మించే హరిత హోటల్‌కు శంకుస్థాపన చేస్తారని అన్నారు. అలాగే టూరిజం ప్యాకేజీలో నిర్మించిన కల్యాణ మండపాన్ని, మిషన్ భగీరథ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 2018లో ముఖ్యమంత్రి పాలకుర్తి పర్యటన సందర్భంగా వల్మిడి ఆలయం గురించి తెలుసుకున్నారని, ఆయన సహకారంతో సీతారామచంద్రస్వామి ఆలయాన్ని రూ.75 కోట్ల టూరిజం ప్యాకేజీ కింద పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశామని వివరించారు. ఆలయ ప్రారంభోత్సవానికి సీఎంతో పాటు చిన్న జీయర్‌స్వామి, మంత్రులు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులతో కలసి అభివృద్ధి పనులను పరిశీలించారు.

విరాళాల వెల్లువ..

వల్మిడి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి దాతలు విరాళలతో ముందుకు వస్తున్నారు. నీటిపారుదల శాఖ డీఈఈ శ్రీకాంత్ రూ.3లక్షలు, కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లికి చెందిన పుస్కూరి దయాకర్‌రావు రూ.15 లక్షలు, కాంట్రాక్టర్ వర్ర వెంకన్న రూ.5 లక్షలు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో ఆలయ ఈఓ బి.లక్ష్మీప్రసన్నకు అందజేశారు. బీఆర్‌ఎస్ యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ రూ.24 లక్షల విలువైన వెండి విగ్రహాలను రామాలయానికి సమర్పించారు. వివేరా హోటల్ యజమాని నర్సింహారెడ్డి రూ.20వేలతో భక్తులకు ప్రసాదాలు అందజేస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి



వీవర్స్‌కాలనీలో చేనేత వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎం చేస్తుందో యూత్, రైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, డిక్లరేషన్‌లో తెలిపామని వివరించారు. గ్యాస్ ధర రూ.500 తగ్గించడంతో పాటు ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు, పంటల పెట్టుబడికి రూ.15వేలు, రూ.2లక్షల రుణ మాఫీతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. బండి సుధాకర్, శ్రీరాం శ్రీనివాస్, నాగరాజు, లక్ష్మయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజించాలి



మాట్లాడుతున్న డీఈఓ రాము

లింగాలఘణపురం: పర్యావరణ పరిరక్షణకు మట్టితో తయారు చేసిన గణపతినే పూజించాలని డీఈఓ రాము అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో మట్టి విగ్రహాల ప్రాముఖ్యతపై నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. వినాయకుడి ఆవిర్భావం ప్రకృతిలోని సహజమైన పదార్థాలతోనే జరిగిందని, ప్రకృతికి విరుద్ధమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో జీఈసీఓ గౌషియా, రాష్ట్ర ఎన్‌జీఓ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, ఎంఈఓ చంద్రారెడ్డి, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

జనగామ రూరల్: కారు ఢీ కొట్టడంతో బైక్ పై వస్తున్న తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జనగామ మండలం పెద్దపహాడ్ స్టేజీ వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గోపిరాజుపల్లికి చెందిన మడికొండ కనకయ్య తన చిన్న కుమారుడికి అనారోగ్యంగా ఉంటే జనగామలోని ఆస్పత్రిలో చూపించిన తర్వాత అతడిని కుటుంబ సభ్యులు ఆటోలో ఇంటికి తీసుకెళ్తున్నారు. వెనకాల కనకయ్య, మరో కుమారుడు రాకేష్ బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో తండ్రీకొడుకులు బైక్ నుంచి కింద పడిపోయారు. రాకేష్‌కు కాలు విరగ్గా, కనకయ్య సైతం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా వాసికి కీలక బాధ్యత



హన్మకొండ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర డాటా అండ్ కాల్ సెంటర్ టీమ్ కన్వీనర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లావాసి రావుల భరత్ రెడ్డికి అధిష్టానం కీలక బాధ్యత అప్పగించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన రావుల భరత్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూకేలో ఉన్నత విద్య పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేసిన ఆయన.. రాజకీయాలపై మక్కువతో స్వదేశం చేరుకుని బీజేపీలో కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందిన రైతు శంకర్

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని టీక్యాతండా జీపీ శివారు జగ్న తండాలో జరిగింది. తండాకు చెందిన జాటోత్ శంకర్(50) బుధవారం తన పశువులకు పొలంలో గడ్డి కోస్తున్నాడు. ఈ క్రమంలో వేలాడుతున్న కరెంట్ సర్వీస్ వైర్‌ను గమనించకుండా తాకాడు. దీంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

బాధితులకు సోదరులై..

వరదతో సర్వస్వం కోల్పోయిన వారికి ఆత్మీయ బంధువులుగా నిలిచారు..

వారు అక్కాతమ్ముళ్లు కాదు.. చెల్లి అన్నయ్యలు కాదు.. అసలే రక్త సంబంధం కాదు.. ఒకరంటే ఒకరికి పరిచయం లేదు. కానీ వారిని ఓ బంధం కలిపింది. అదే వరద బంధం. తోబుట్టువులు కూడా ఆదరించలేని ఈ రోజుల్లో ఎలాంటి సంబంధం లేని వారు 'అధైర్య పడకండి.. మేమున్నామంటూ' క'న్నీటి' వరద నుంచి కాపాడారు. ఇటీవల కురిసిన వర్షం వరంగల్ నగరంతోపాటు భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. నిత్యావసరాల నుంచి గృహోపకరణాల వరకు సర్వం వరదలో కొట్టుకుపోయాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలి హాహాకారాలు చేస్తున్న సమయంలో తామున్నమంటూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చారు. తమకు తోచిన సాయం అందించి వరద బాధితులను క'న్నీటి' కష్టం నుంచి గట్టెక్కించారు. దీంతో నిరాశ్రయులు వారికి శతకోటి వందనాలు పెట్టారు. ఆపదలో కాపాడిన వారే తమకు నిజమైన రక్తసంబంధీకులు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా వరద బాధితలకు చేయూతనందించి ప్రేమబంధం చాటిన వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ ఏటూరునాగారం

సోదరుల్లా అక్కున చేర్చుకున్నారు..

- సామాజిక సేవలో శివనగర్ మిత్ర మండలి ఆదర్శం..
- వరద బాధితులకు పలు రకాలుగా చేయూత

వరద ముంపు బాధితులకు శివనగర్‌లో ఏర్పాటు చేసిన శివనగర్ మిత్రమండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో మేమున్నామంటూ నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేసింది. వరదల్లో చిక్కుకుని కనీసం తాగేందుకు నీరు, తినడానికి ఆహారం కూడా లభించని సమయాన బాధితుల కన్నీళ్లు తుడిచేందుకు శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మేరుగు అశోక్ తోబుట్టువులా ముందుకు వచ్చారు. బాధితులను అక్కున చేర్చుకుని ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసి వారి ఆకలితీర్చారు. దీంతో పలువురు సమాజసేవకులు మేరుగు అశోక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.



వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు (ఫైల్)

తోబుట్టువులా ఆదుకున్నారు..



ఇటీవల కురిసిన వర్షాలకు మా కాలనీ మొత్తం జలమయమైంది. కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఆ సమయంలో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో మీకు మేమున్నామంటూ శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ బాధ్యులు ముందుకువచ్చారు. తోబుట్టువులా నిలిచి మమ్మలను ఆదుకున్నారు. వారే నాకు నిజమైన సోదరులు. వారికే రాఖీ కట్టి సోదరభావం చాటుకుంటా.

అల్లం స్వరూప, శివనగర్

రక్త సంబంధీకులు కాకపోయినా..



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రతి ఇంట్లో వస్తువులు కొట్టుకుపోయి ఇబ్బందులు పడ్డాం. మా బాధలను తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్ని రకాల సహకారం అందించారు. రక్త సంబంధీకులు కాకపోయినా ఎక్కడి నుంచో వచ్చి మాకు సరుకులు అందించారు. వారి సహకారంతో కొంత ఉపశమనం పొందాం.

-కొత్త సుదర్శన్‌రెడ్డి, రైతు మోరంచపల్లి

వారి సహకారం మరువలేనిది



గ్రామంలో వరద కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనగా కుటుంబీకులు, తోడ పుట్టిన వారు ఓదార్చే తప్ప ఎవరూ ఆదుకోవడానికి ముందుకు రాలేదు. కానీ వేర్వేరు గ్రామాల నుంచి మాకు పరిచయం లేని వ్యక్తులు వచ్చి వంట సామాను, చద్దర్లు, డబ్బు, అన్నదానం, మంచి నీళ్ల పంపిణీ చేశారు. వారి సహకారం జీవితంలో మర్చిపోలేం.

-చుక్క కవిత, గృహిణి, మోరంచపల్లి



హసన్‌పర్తి: రాఖీ ఆకారంలో పెంబర్తిలోని ఏకశిల టెక్నో పాఠశాల విద్యార్థులు

మోరంచపల్లిలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)



స్వచ్ఛంద సంస్థలు, దాతల ఔదార్యం

- వరద బాధితులకు ఆపన్నహస్తం

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో గత నెలలో సంభవించిన వరదలతో గ్రామస్తులు సర్వస్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలి పుట్టెడు దుఃఖంలో వీరికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిచాయి. సోదరుల వలే మనోధైర్యం నింపుతూ నిత్యావసరాలు, దుస్తులు అందజేసి ఆసరా అయ్యారు. దీంతో ఆడబిడ్డకు పుట్టినింటి నుంచి పంపినట్లు నిత్యావసరాలు అందజేసి తమను ఆదుకున్నారని, వీరి సేవలను జన్మలో మరిచిపోలేమని వరద బాధితులు పేర్కొన్నారు.

వరదలతో అతలాకుతలం



వరదలతో కొండాయి గ్రామం పూర్తిగా అతలాకుతలమైంది. నిరాశ్రయులుగా మిగిలిన మమ్ములను స్వచ్ఛంద సంస్థలు, మహిళా ప్రతినిధులు అక్కా, చెల్లెల్లవలే వచ్చి ఆదుకున్నారు. కట్టుబట్టలతో రోడ్డున పడిన మాకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి ఆదుకున్నారు. వారి సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేం.

-కట్ల సందీప్, కొండాయి

సొంతోళ్లు కూడా ఇలా చేయరు..



ఇల్లు నీటిలో మునిగి దిక్కు తోచని స్థితిలో ఉన్న సమయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు మా దగ్గర వచ్చి కావాల్సిన వస్తువులు అందజేసి ఆదుకున్నారు. సొంతోళ్లు కుడా ఇలా చేయరు. దీనిపై వారికి జన్మజన్మలకు రుణపడి ఉంటాం.

-బొల్లికుంట లక్ష్మి,మల్యాల

కంబాలపల్లిలో వృక్ష రక్షాబంధన్

- పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం మొక్కలు, చెట్లకు రక్షాబంధన్ చేశారు. తమ పరిసరాల్లోని మొక్కలు, చెట్లను కాపాడుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెచ్‌ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ చెట్లు పర్యవరణం, మానవులకు చేస్తున్న మేలును తెలియజేసే ఉద్దేశంతో వృక్ష రక్షాబంధన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు, పర్యావరణ పరిశోధకుడు వి.గురునాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన ఉండాలన్నారు. 15 సంవత్సరాలుగా ఈ వృక్ష రక్షాబంధన్ దివస్ జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామనర్సయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్, తిరుపతి, సోమేశ్వర్, శోభారాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వృక్ష రక్షాబంధన్ వేడుకలు జరుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చంద్రయాన్-3 పై అవగాహన

గార్ల: చంద్రయాన్–3పై గార్ల వాసి, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ గంజి వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3తో చంద్రుడి దక్షిణార్థ గోళంలో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేసే హీలియం ఖనిజం నిక్షిప్తమై నట్లు గుర్తించామన్నారు. పది కేజీల హీలియం ఖనిజం పొందగలిగితే రాష్ట్రానికి సంవత్సరం పాటు విద్యుత్‌ను అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చార్లి, అజిత్, సుందరయ్య, రాజేష్, వెంకన్న, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 గురించి వివరిస్తున్న వెంకటనారాయణ

కర్రతో కొట్టి.. ఉరివేసి..

- భార్యను కడతేర్చిన భర్త..
- కాశిగూడెంలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసైన భర్త.. భార్యను దారుణంగా కడతేర్చాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాశిగూడేనికి చెందిన షేక్ ఖాసీమ్ కుమార్తె సయ్యద్ హజరత్‌బీ(28)కి తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన అమీర్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. హజరత్‌బీ, అమీర్ దంపతులు కొన్నేళ్లుగా కాశిగూడెంలో బండ కొట్టే పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అమీర్.. తరచూ భార్యతో గొడవపడేవాడు. తాను మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో అమీర్ మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేసి పారిపోయాడు. బుధవారం ఉదయం హజరత్ మృతిచెంది ఉన్న విషయాన్ని గుర్తించిన ఆమె తండ్రి ఖాసీం చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవేందర్ ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడు.



హజరత్‌బీ (ఫైల్)

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

- ఆలేరులో ఘటన.. కేసు నమోదు

నెల్లికుదురు: కొడుకుపై తండ్రి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఈ నెల 27న మండలంలోని ఆలేరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనగాం మౌనిక, నరేశ్‌కు 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు నవదీప్, కూతురు ఉన్నారు. నరేశ్ మద్యానికి బానిసై భార్య మౌనికను రోజూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15న కూడా మద్యం సేవించి వచ్చి కొట్టగా మౌనిక తన తల్లిగారి ఊరు సూరిపెల్లికి వెళ్లిపోయింది. నరేశ్ ఈ నెల 27న సూరిపెల్లికి వెళ్లి భార్యతో గొడవపడి కుమారుడు నవదీప్‌ను తనతో ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం మద్యం మత్తులో అదే రోజు రాత్రి కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు బాబుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి మౌనికకు విషయం తెలిపారు. మౌనిక ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

మరిపెడ: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల తండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మాకులతండాకు చెందిన గుగులలోతు అమ్రు(27) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో భార్య ప్రమీలతో కలిసి వ్యవసాయ చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడం, కుటుంబ పోషణ గడవకపోవడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్ద అమ్రు పురుగుల మందు తాగడంతో గమనించిన భార్య.. చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ సీజ్

- కంపెనీపై దాడి.. రూ.2.88 లక్షల విలువైన 20 క్వింటాళ్ల పేస్ట్ స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.2.88లక్షల విలువైన 20క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గాయి సతీష్ శ్రీభద్రకాళీ మాత అల్లం, వెల్లుల్లి తయారీ చేసే కంపెనీ ఏర్పాటు చేయగా, అదే ప్రాంతానికి చెందిన బిలకిష్ అబువాని మరో కంపెనీ స్థాపించాడు. అదే ప్రాంతానికి చెందిన కూరపాటి నాగరాజు కూడా జై గణేష్ అల్లం, వెల్లుల్లి పేస్ట్ కంపెనీ ఉంది. ముగ్గురు రసాయనాలు కలిపి పేస్ట్ విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. సీపీ రంగనాథ్ ఆదేశాలు.. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సూచనల మేరకు పోలీసులు బుధవారం రాత్రి సతీష్, బిలకిషన్ అబువాని, నాగరాజుకు చెందిన కంపెనీలపై ఆకస్మిక దాడి చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసి వారినుంచి అల్లం, వెల్లుల్లి పేస్ట్, తయారీకి ఉపయోగించే ముడిసరుకులను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రాంబాబు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య..

- కాంట్రాక్ట్ డబ్బులు అడిగినందుకు ఘాతుకం..
- శివనగర్‌లో కలకలం
- పోలీసుల అదుపులో ఓ నిందితుడు?
- కొరవడిన నిఘా.. యథేచ్ఛగా హత్యలు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఇదే పీఎస్ పరిధిలో ఇద్దరు నిందితులు ఓ వృద్ధుడిని గొంతు కోసి అతికిరాతంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవక ముందే మంగళవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు రాడ్లతో తలపై కొట్టి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఎస్‌డీ నజీర్ (37) వరంగల్ రైల్వేస్టేషన్‌లో సబ్ కాంట్రాక్ట్ తీసుకుని మొబైల్ క్యాంటీన్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిపై మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ ఉంది. ఇదిలా ఉండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పదిమంది వ్యక్తులు బతుకు దెరువు కోసం వరంగల్ వచ్చి శివనగర్‌లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా రైల్వే స్టేషన్ ప్రాంగణం, రైళ్లల్లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్, కీచైన్స్, పర్సులు విక్రయిస్తారు. వీరు స్టేషన్‌లో చిరువ్యాపారం చేసుకునేందుకు సబ్ కాంట్రాక్టర్, మృతుడు నజీర్‌కు నెల వారీగా అద్దె చెల్లించాలి. అయితే చిరువ్యాపారం చేస్తున్నారు. కానీ కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్నారు. రేపు మాపు అంటూ దాటవేస్తున్నారు.

ఇంటికి వెళ్తూ హత్యకు గురై..

మంగళవారం అర్ధరాత్రి నజీర్ క్యాంటీన్ బంద్ చేసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివనగర్‌లోని తిరుమల బార్ పక్కనే ఉత్తర్‌ప్రదేశ్ వారు అద్దెకుంటున్న గదికి చేరుకున్నాడు. ఇరువురు మధ్య కాంట్రాక్ట్ డబ్బుల విషయంలో గొడవ జరగడంతో వారిని నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు ఐరన్‌రాడ్లతో నజీర్ తలపై బలంగా కొట్టడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. నజీర్ చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం వారు గది నుంచి పారిపోయారు. ఈవిషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించి మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం నజీర్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రిజ్వాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు. కాగా, నగరంలో నిఘా కొరవడడంతోనే వరుస హత్యలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



నజీర్ (ఫైల్)

పోలీసుల అదుపులో నిందితుడు..?

నజీర్‌ను దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితులు పరారయ్యారు. వీరిలో ఓ వ్యక్తిని రైల్వేస్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించినట్లు సమాచారం. పదేపదే తమను కాంట్రాక్ట్ డబ్బులు అడగడం వల్ల.. పైగా బెదిరించడంతో ఆత్మరక్షణకు హత్య చేశామని చెప్పినట్లు తెలుస్తోంది.

తల్వార్ ఫ్లెక్సీ తొలగింపు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాలపురం పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓ పార్టీ నాయకుడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తల్వార్ పట్టుకుని ఉన్న ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. బుధవారం గుర్తించిన పోలీసులు ఫ్లెక్సీని తొలగించారు.



ఫ్లెక్సీని తొలగిస్తున్న పోలీసులు



నీలి చందమామ..సొగసు చూడతరమా అన్నట్టు కనిపించింది. బుధవారం రాత్రి చంద్రుడు.. భూమికి దగ్గరగా రావడంతో చాలా పెద్దగా కనిపించారు. వరంగల్ నగరంలో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇలా నీలిరంగులో సూపర్ మూన్ దర్శనమిచ్చారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ